## క్లుప్తంగా

### నేడు సుందర గోవిందుడికి ఘటాభిషేకం


కొవ్వూరులోని సుందర గోవిందుడు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారంస్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ నదుల నుంచి సేకరించిన నదీ జలాలతో 1,116 కలశాలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి సుందరగోవిందుడికి అభిషేకం చేస్తామన్నారు. ఆలయం ప్రతిష్ఠించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద గోపూజ, సప్తశతి పారాయణ, సుబ్రహ్మణేశ్వర మూలమంత్ర జపం, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ఈ సహస్ర ఘటాభిషేకం ప్రారంభమవుతుందని, అనంతరం ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు పారుపూడి సూర్య రామసుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. 30వ తేదీతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన అన్నారు.

### అతిసార నివారణకు కార్యాచరణ


అతిసార నివారణ చర్యలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి వివరిస్తున్న దృశ్యం

నల్లజర్ల: మండలంలో అతిసార నివారణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలను వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టరు వెంకటేశ్వరావుకు నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు గంగాధరరావు శనివారం వివరించారు. ప్రతి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. పీహెచ్‌సీ పరిధిలో జీరో డయేరియా కేసుల లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. వైద్య, ఉద్యోగులను డీఎంహెచ్‌ఓ అభినందించారు. ఆరోగ్య సహాయకుడు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నరు.

### నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

నల్లజర్ల: ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ చదివిన నిరుద్యోగ యువతీ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు స్వర్ణ భారతి ట్రస్ట్ తెలిపింది. ఆదివారం అనంతపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, గాగిల్లాపూర్ యూనిట్, దిండిగల్, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్‌లు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

### కోతకు గురైన వంతెన అప్రోచ్‌లు


దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో కుడికాలువ వంతెన వద్ద కోతకు గురైన అప్రోచ్‌లు

దేవరపల్లి: దేవరపల్లి–పల్లంట్ల రోడ్డులో పోతవరం కుడి కాలువపై గల వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది. వంతెనకు ఇరువైపులా గల అప్రోచ్‌లు వర్షాలకు కోతకు గురాకావడంతో లోయలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు వంతెనను పరిశీలించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### వెంకన్న ఆలయంలో పూజలు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాయున స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల గౌతమ్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయంతో రోగుల అవస్థ

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం సుమారు రెండు గంటలు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ లేక ఉక్కపోతతో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఆసుపత్రిలోని జనరేటర్ పని చేయకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ స్పందించి ఆదేశాలివ్వడంతో నిడదవోలు విద్యుత్ అధికారులు ఆసుపత్రికి వచ్చి తక్షణమే విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఆసుపత్రిలోని జనరేటర్‌ను హుటాహుటిన మరమ్మతులు చేయించాయి.

# అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

- ఎన్నికల్లో జయాపజయాలు సహజమే
- మాజీ ఎమ్మెల్యే తలారి, డాక్టర్ గూడూరి
- వైఎస్సార్ సీపీ మండలస్థాయి సమావేశం


చాగల్లులో వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశంలో పాల్గొన్న తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

చాగల్లు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. ఆ పార్టీ మండల స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని శనివారం స్థానిక కృష్ణదేవరాయ కల్యాణ మండపంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల్లో జయాపజయాలు సహజమని, ప్రజా మద్దతు ఉన్నందునే వైఎస్సార్ సీపీకి 40 శాతానికి పైగా ఓట్లు లభించాయని గుర్తు చేశారు. పార్టీలో కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. 2029 ఎన్నికల్లో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేద్దామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. సర్పంచులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, అన్ని స్థానిక సంస్థల పదవుల్లోనూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నందున మరింతగా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని కేంద్రంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని ఆయన అన్నారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎప్పుడైనా కలవవచ్చని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమికి అమలు సాధ్యం కాని చంద్రబాబు హామీలు, టీడీపీ, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలే కారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల కన్వీనర్ చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు జుట్టా కొండలరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మానవత కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నిడదవోలు: పట్టణంలో ఏబీఎస్ టౌన్ హాలులో ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిడదవోలు మానవత సేవా సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తన్నీడి బోసు తెలిపారు. నిడదవోలు మానవత నూతన అధ్యక్షుడిగా దారపు రెడ్డి సూర్యచంద్రరావు, కార్యదర్శిగా ముళ్లపూడి సోమరాజు, కోశాధికారిగా పీఎస్‌వీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా అన్నంరెడ్డి కొండలరాయుడుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు హాజరవుతారని పేర్కొన్నారు.

## గోపవరంలో ఉత్సాహంగా ‘నేను బడికి పోతా’


గోపవరంలో జెడ్పీ హైస్కూల్లో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరపల్లి: గోపాలపురం మండలం గోపవరంలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలను వివరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. 22 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరినట్టు ప్రధానోపాధ్యాయుడు గొల్లపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయ బృందం పని చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. మల్లికార్జునరావు, కాశీ విశ్వేశ్వరరావు, ఫణి కుమార్ శర్మ, భాస్కరరావు, షేక్ ఇమామ్, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం


కొవ్వూరులో కక్షిదారులను విచారిస్తున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్.శ్రీనివాసరావు


లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రామకృష్ణ

కొవ్వూరు: రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టు హాలు శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 129 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రీ లిటికేషన్ కేసులు తన అధ్యక్షతన నిర్వహించిన బెంచ్‌లో న్యాయవాద సభ్యుడిగా ఎంఎస్ చక్రపాణి వ్యవహరించారు. సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారానికి ఏర్పాటు చేసిన రెండో బెంచ్ ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.బాలత్రిపుర సుందరీదేవి అధ్యక్షతన నిర్వహించారు. దీనిలో న్యాయవాది పి.సుబ్బారావు సభ్యుడిగా ఉన్నారు. మూడో బెంచ్‌కి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన నిర్వహించారు.న్యాయవాది తారాకుమారి సభ్యురాలిగా ఉన్నారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో 33 సివిల్ కేసులు, 87 క్రిమినల్, మూడు ప్రీ లిటికేషన్ కేసులు రాజీ అయ్యాయన్నారు. ప్రీ లిటికేషన్ కేసులకు సంబంధించి రూ.19వేలు, సివిల్ కేసుల్లో రూ.3,06,87,676 చెల్లించే విధంగా పరిష్కారమయ్యాయి.

**259 కేసుల పరిష్కారం**

నిడదవోలు: సివిల్, క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, రాజీయోగ్యమైన కేసుల పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లు దోహదపడతాయని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి. రామకృష్ణ పేర్కొన్నారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం ఆయన అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ కోర్టులో క్రిమినల్ 34, సివిల్ 3, బెంచ్ కోర్టు కేసులు 222 కలిపి మొత్తం 259 కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రవికుమార్, జి. రవి, ఏఎస్ విశ్వనాథ్, సీహెచ్ విజయకుమార్, ఉల్లూరి సతీష్, ఎం. మెహబూబ్, డి.రవిశంకర్, సీహెచ్ చిట్టిబాబు, ఎస్. సుబ్బారావు, ఎం. వెంకటేశ్వరరావు, నక్కా అజయ్‌బాబు పాల్గొన్నారు.

## భారత గణాంక పితామహుడు మహలనోబిస్‌కు ఘన నివాళి


తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రశాంత చంద్ర మహలనోబిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

తాళ్లపూడి: భారత గణాంక పితామహుడిగా పేరొందిన ప్రశాంత చంద్ర మహలనోబిస్ గణాంక శాస్త్రంలో విశేష సేవలు అందించిన మహోన్నతుడని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ ప్రశాంత చంద్ర మహలనోబిస్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహలనోబిస్ చొరవ వల్లనే భారత ప్రణాళికా సంఘం ఏర్పడిందన్నారు. ఆయన 1946లో ఐక్యరాజ్యసమితి గణాంక శాస్త్ర కమిషన్ సభ్యుడిగా, 1949లో కేంద్ర మంత్రివర్గం గణాంక శాస్త్ర గౌరవ సలహాదారుడిగా, 1955 నుంచి 1967 వరకు ప్రణాళిక సంఘం సభ్యుడిగా విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతి, జూనియర్ అసిస్టెంట్ దీపక్, సర్వేయర్ వీరాస్వామి, సహాయ సర్వేయర్లు ప్రసాద్, ప్రియ, ఇందు, అంబిక, వీఆర్‌ఏలు సురేష్, శ్రీ లక్ష్మి, భాగ్యలక్ష్మి, వెంకటరత్నం, నాగరాజు పాల్గొన్నారు.

## అధిక ఫీజులను నియంత్రించాలి


ఎంఈవో గణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో భారీగా పెంచిన ఫీజులను నియంత్రించాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం నిడదవోలు ఎంఈఓ గణేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ప్రైవేటు యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పుస్తకాలు, స్టేషనరీ కూడా విక్రయిస్తున్నారని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఈవో కార్పొరేట్, స్కూళ్లు, కాలేజీలను పరిశీలిస్తానని, నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ. గోపి, తూరుగోపు నాని, చరణ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో ఫీజులు నియంత్రించాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండు చేశారు. మండలంలోని సమిశ్రగూడెంలో ఎంఈఓ కేవీ గణేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తల్లిదండ్రుల బలహీనతలను యాజమాన్యాలు ఆసరా చేసుకొని ఫీజులు పెంచుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కె.గోపి, తూరుగోపు నాని చరణ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు పరిశీలన


నల్లజర్ల మండలం ముసుళ్లగుంటలో ఆయిల్ పామ్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అరుణాచల్‌ప్రదేశ్ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ మంత్రి గాబ్రియేల్ డి వ్యాంగు షు తదితరులు

నల్లజర్ల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో ముసుళ్లగుంట వద్ద త్రీఎఫ్ ఆయిల్ పామ్ నర్సరీ, యర్నగూడెంలో క్రషింగ్ విధానం, దూబచర్లలో ఎరువుల పంపిణీ, అయ్యవరంలో నూతనంగా నిర్మిస్తున్న ఆయిల్ పామ్ క్రషింగ్ ఫ్యాక్టరీని అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ మంత్రి గాబ్రియేల్ డి వాంగ్ షు శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి హెగేటారి, మంత్రి ఓయస్‌డీ సరంగజ్యోతి గోస్వామి ఉన్నారు. నర్సరీలో హైబ్రీడ్ రకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరుణాచలప్రదేశ్‌లో ఇటీవల ఆయిల్ పామ్ సాగు ప్రారంభించామన్నారు. ఈ రాష్ట్రంలో సాగు విధానం పరిశీలించేందుకు వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి శారదాదేవి, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి దుర్గేష్, కొవ్వూరు సబ్ కలెక్టరు అశుతోష్‌మిశ్రా, త్రీఎఫ్ ఆయిల్ పామ్ సీఈఓ గోయంకా, కిలారి శ్రీనివాసరావు, సూర్యారావు, నల్లజర్ల, దేవరపల్లి ఉద్యానశాఖాధికారులు బబిత, రమేష్, తహసీల్దారు కృష్ణారావు, ఈఓపీఆర్డీ సింహాద్రి, ఏఓ కమల్‌రాజ్ పాల్గొన్నారు.

**సేంద్రియ వరి సాగు విధానం పరిశీలన**

నల్లజర్ల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో రైతు జమ్ముల సతీష్ వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న సేంద్రియ వరి వ్యవసాయ సాగును అరుణాచల్‌ప్రదేశ్ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ మంత్రి గాబ్రియల్ డి వ్యాంగ్ షు శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. రైతు సతీష్‌ను సేంద్రియ సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వరి వంగడాలు, కాలపరిమితి, పచ్చిరొట్ట ఎరువులు, ఆయిల్ పామ్ సాగు, హైబ్రీడ్ రకాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అరుణాచల్‌ప్రదేశ్ పశుసంవర్ధక శాఖ కార్యదర్శి శ్రీహగేతారి, ఓఎస్డీ శ్రీసారంగ్‌జ్యోతి, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఉద్యాన అధికారి దుర్గేష్, ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ కమల్‌రాజ్ తదితరులున్నారు.

## పొగాకు బోర్డు ఆర్‌ఎం ఆదిశేషయ్యకు ఘన సన్మానం


గోపాలపురంలో ఆర్‌ఎం ఆదిశేషయ్య దంపతులను సన్మానించి, జ్ఞాపిక అందజేస్తున్న రైతులు

దేవరపల్లి: పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ అధికారి ఎం. ఆదిశేషయ్య, మాలతి దంపతులను పొగాకు రైతులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆదిశేషయ్య ఈ నెల 30న పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం రాత్రి గోపాలపురంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల రైతులు, వేలం కేంద్రాల అధికారులు కార్యక్రమంలో పాల్గొని ఆదిశేషయ్య దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ 32 ఏళ్లగా పొగాకు బోర్డులో వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి రైతుల పక్షపాతిగా ఆదిశేషయ్య నిలిచారని కొనియాడారు. గోపాలపురంలో వేలం నిర్వహణాధికారిగా పనిచేసి పదోన్నతిపై రీజనల్ మేనేజరుగా గతేడాది బదిలీపై వెళ్లినట్టు రైతులు తెలిపారు. రైతులకు, అధికారులకు, సిబ్బందికి ఆర్‌ఎం ఆదిశేషయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షులు, వేలం నిర్వహణాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగి సేవలకు తగిన గుర్తింపు


పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు సుగుణకుమారిని సత్కరిస్తున్న ఎంఈఓలు

నల్లజర్ల: ఉద్యోగికి తన విధి నిర్వహణలో అందించిన సేవలకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈఓ వై.సత్యనారాయణ, ఎంఈఓ–2 భగవతి అన్నారు. అచ్చన్నపాలెం ఎంపీపీ పాఠశాల–2లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కొండ్రెడ్డి సుగుణకుమారి పదవీ విరమణ సందర్భంగా శనివారం సాయంత్రం ఆ పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి సుగుణకుమారి శక్తివంచన లేకుండా కృషి చేశారని అభినందించారు. ఈ సందర్భంగా సుగుణకుమారి, ఆమె భర్త మురళీని అధికారులు, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పక్రుద్దీన్ అహమ్మద్, జిల్లా కార్యదర్శి భవానీ, కార్యవర్గ సభ్యులు మనోహరకుమార్, కిశోర్, రిటైర్డు ఉపాధ్యాయులు నందం రాజేంద్రప్రసాద్, ఐడీవీ అప్పారావు, ఐవీ సత్యం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, యస్.యం.ఆలీసాహెబ్ పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ


తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

తాళ్లపూడి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై 1 నుంచి సచివాలయం సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తామని మండల ప్రత్యేకాధికారి (డీపీఓ) రాంబాబు తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి రాంబాబు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పింఛన్ల సొమ్ము ఇక నుంచి ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారని అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని 7,941 పెన్షన్లదారులకు రూ.7 వేలు పంపిణీ చేస్తారని, దీనికి 129 మంది సచివాలయ సిబ్బందిని నియమించామని తెలిపారు. ఎక్కువ మొత్తంలో నగదు బ్యాంకు నుంచి డ్రా చేసి తీసుకు రావాల్సి ఉన్నందున పోలీస్ సిబ్బంది సహకారం తీసుకుంటామన్నారు. వర్షాకాలం కారణంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు జూన్ 27 నుంచి జూలై 4 తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. తాగునీరు పైపుల లీకేజీల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, డాక్టర్లను అప్రమత్తం చేసి ప్రజారోగ్యానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎంపీడీవో టి వెంకటరమణ, ఇవోపీఆర్డీ కేవీఎస్ వీరన్న, మండల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**10,551 మందికి పెన్షన్లు పంపిణీకి ఏర్పాట్లు**

నిడదవోలు రూరల్: నిడదవోలు మండల పరిధిలోని 22 సచివాలయాల పరిధిలో 10,551 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 1న ఉదయం 6 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభిస్తామని, ఒక్కో సచివాలయ ఉద్యోగి 50 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక, కార్యాలయ ఏఓ రత్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం**

దేవరపల్లి: ప్రతి నెల అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగులు, డప్పు కళాకారులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న పింఛన్ల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. జూలై ఒకటి నుంచి పెంచిన పింఛన్ రూ. 4 వేలతో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలలకు రూ. 3 వేలు కలిపి పంపిణీ చేయనున్నారు. ఒక్కొక్కరికి రూ. 7 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ము అందజేస్తారు. దివ్యాంగులకు రూ. 6 వేలు, డయాల్సిస్ రోగులకు రూ. 10 వేలు, బోధకాలు వ్యాధిగ్రస్తులకు రూ. 15 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. ఇందుకు అవసరమైన నగదును గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం బ్యాంకుల నుంచి డ్రా చేసి సిద్ధం చేశారు. జూలై 1న ఉదయం 6 గంటల నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు. దేవరపల్లి మండలంలో 11,171 మంది లబ్ధిదారులకు రూ. 7,58,86,000, గోపాలపురం మండలంలో 9238 మంది లబ్ధిదారులకు రూ.6.30 కోట్లు, నల్లజర్ల మండలంలో 11,672 మంది లబ్ధిదారులకు రూ. 7.16 కోట్లు పింఛన్లు అందజేయనున్నట్టు ఎంపీడీఓ పి. ప్రభాకరరావు తెలిపారు.

**ఇంటింటికీ పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు**

చాగల్లు: మండలంలో జూలై ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. మొత్తం అన్ని రకాల పెన్షన్లు కలిసి చాగల్లు మండలంలో 9,503 మందికి రూ.6,30,57,000 జూలై 1న 165 మంది సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసామని ఎంపీడీఓ చెప్పారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రావణ్ కుమార్, కార్యాలయ ఏఓ నిర్మలకుమారి, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.